
# బాబాయిగారు

(ప్రఫుల్లచంద్ర)



ఎప్పుడూ రద్దీగా వుండే జాతీయ రహదారిని ఆనుకొని వున్న గ్రామం. నిజానికి దాన్ని  గ్రామం అనే కంటే, తీరూతెన్నూ లేని వంకర టింకర మట్టిరోడ్ల ప్రక్కన పడేసిన రకరకాల యిళ్ళ  పోగులు – అనడం న్యాయం.

ఒక జూనియర్ కాలేజీ, రెండు పెద్ద హోటళ్ళు, మూడు సినిమా హాళ్ళు వుండి కాస్త వెడల్పుగా కనిపించేదే మెయిన్ రోడ్.

ఆ రోడ్ మీదుగా ఊరు చివర ఇంద్రభవనం లాంటి నాయుడిగారి మేడ. ఈ మధ్యన ఆయన మంత్రి అయారు. ఇంటర్వ్యూ చేయడానికని రెండు రోజులుగా టౌన్ నుండి వస్తున్నాం గాని మంత్రిగారి దర్శన భాగ్యం కలగలేదు. సాయం కాలం నాలుగ్గంటలకు రమ్మన్నాడు నౌకరు.

అప్పుడు టైమ్ పది. టౌన్‌కి వెళ్ళిపోయి మళ్ళీ నాలుగ్గంటలకు రావాలంటే ఇబ్బందే. "ఈ ఊళ్ళోనే ఎక్కడో గడిపేద్దాం" అన్నాడు పుల్లారావు. మెడలో కెమేరా, చేతిలో టేప్ రికార్డర్ అతని  అలంకారాలు.

వెనక్కి మళ్ళి, తలదాచుకునే చోటు కోసం వెదికాం. ఎక్కడా అనువుగా లేదు. ఊరు ఈ చివరకొచ్చేశాం.

రోడ్డు ప్రక్కనే పెద్ద పాక. వాటం చూస్తే డబ్బా హోటల్‌లా వుంది. కాని మూసి వుంది. కావడి నీళ్ళతో లోనికి వెళ్తున్న అతడ్ని ఆపి అడిగాం. "ఓ రెండు మూడు గంటలు యిక్కడ వుండొచ్చా?.. డబ్బులిస్తాం..."

"డబ్బు అక్కరలేదుగాని మీరు టౌన్ మనుషులు. ఇక్కడ వుండగలరా అని..."

అదే పెర్మిషన్‌గా భావించి అతనితో లోనికి ప్రవేశించాం.

ఒక మూల టేబుళ్ళూ, కుర్చీలూ, ఏదో మీటింగ్ కోసం అన్నట్లు పొందికగా సర్దబడి వున్నాయి. ఆ హోటల్‌కి సెలవు కాబోలు. ఆ కుర్చీల్లో సెటిల్ అయిపోయాం.

ఆ గ్రామానికున్నది ఒక్కటే మంచినీళ్ళ చెరువు. కావడితో నీళ్ళు తెచ్చి యిళ్ళకు సప్లయి చేయడం రవణ వృత్తి. గంగాళం నిండా నీళ్ళు నింపాక మా కోసం మడత మంచాలూ, దిళ్ళూ  తెచ్చి ఒక వార వేశాడు. మేము నడుము వాల్చగానే ప్రక్కనే కుర్చీలో కూర్చున్నాడు.

మేం వచ్చిన పని తెలుసుకొని "మీ మేధావులు

మట్టిలో మాణిక్యాన్ని వదిలేసి, సత్తు రూపాయిలకు మెరుగులు పెడతారెందుకు?" సూటిగా అడిగాడు రవణ.

అతని దృష్టిలో నాయుడుగారు ఖూనీకోరు, రౌడీ. లక్షలు చేతిలో పడితే చాలు పార్టీ ఫిరాయించేసి ప్రభుత్వాన్ని ముంచేసే ఘనుడు.

"అలాంటి వాడ్ని ఇంద్రుడూ, చంద్రుడూ అని పొగుడుతారు మీ పత్రికలవాళ్ళు" అని నిందించాడు.

నీళ్ళు మోసి బ్రతుకు వెళ్ళమార్చే రవణ భావాలూ, భాషా నన్ను ఆశ్చర్యంలో ముంచేశాయి.

"ఈ ఊరి మట్టిలో మాణిక్యాలున్నాయా?" అడిగాను.

అప్పుడు బాబాయిగారి గురించి చెప్పాడు రవణ.

బాబాయిగారంటే ఈ హోటల్ యజమాని. ఆఫీసర్‌గా పదవీ విరమణ చేశాక పట్టెడన్నం కోసం కోడలి ఎత్తిపొడుపులు, సూటిపోటి మాటలూ భరిస్తూ కొడుకు పంచన పడివుండలేక స్వతంత్రంగా జీవించదాన్కి ఈ ఊరొచ్చి ఈ హోటల్ ప్రారంభించారు రిటైర్‌మెంట్ డబ్బుతో.

బయట పెత్తనం ఆయనది. కిచెన్ పెత్తనం పిన్నిగారిది. పెసరట్ వెయ్యాలంటే పిన్నిగారే వేయాలి. అరచేతి మందంలో అల్లం, జీలకర్ర తగు పాళ్ళలో దట్టించిన ఆ పెసరెట్ తింటే జన్మలో మరిచిపోలేరు. మంత్రిగారింటికి కూడా యిక్కడ నుండే సప్లయి.

బాబాయిగారిది టైమ్‌టేబుల్ జీవితం. ఉదయం పది వరకు హోటల్. కాసేపు విశ్రాంతి. తర్వాత రవణ లాంటి యువకులకు విద్యా బోధన. మళ్ళీ సాయంకాలం నాలుగు నుండి ఆరు వరకు హోటల్. రవణ ఎంట్రన్స్ పాసై బియ్యే చదువుతున్నాడంటే ఆయన చలువే. ఉచిత విద్యా బోధనే కాదు, పుస్తకాలు, పరీక్ష ఫీజులూ అంతా ఆయనే.

ఊరంతకూ బాబాయి ఆయన. సలహా సంప్రదింపుల కోసం ఎందరో ఆయన వద్దకొస్తూ వుంటారు. ఆయన సన్నిధే ఒక పెన్నిధి. ఆయనతో సంభాషణే ఒక విద్య.

రెండు గంటలవుతూ వుండగా... బయటరిక్షా... బాబాయిగారు, పిన్నిగారూ.

పట్నం నుండి తెచ్చిన సరుకులు కిచెన్‌లో పెట్టించి ఆయన మా వద్దకొచ్చారు.

స్ఫురద్రూపి, ఆజానుబాహుడు. అనుభవం పండిన జుట్టు. కళ్ళలో కాంతి. ముఖంలో సౌజన్యం. డబ్బా హోటల్ యజమానిగా కాదు, పెద్ద ఆఫీసర్‌లా అనిపించారు. మేము లేచి మంచం మీదనే కూర్చున్నాం.

రవణ పరిచయం చేశాక "భోజనం చేశారా బాబూ!" అని ఆప్యాయంగా అడిగారు. కిచెన్‌లోకి వెళ్ళి భార్యతో ఏదో చెప్పి మాతో కూర్చున్నారు.

"రవణ మీ గురించి చాలా చెప్పాడు" అన్నాను.

"అతని కింకేం పని!" అని నవ్వేశారాయన.

బిలబిలా కొందరు యువకులు లోనికొచ్చారు. ప్యాంట్ షర్ట్‌లు ధరించినా వాటం చూస్తే కూలీ నాలీ చేసుకునేవారిలా వున్నారు. మమ్మల్ని చూసి గప్‌చిప్ అయిపోయి మూలగా సర్దివున్న కుర్చీల్లో కూర్చున్నారు, బాబాయిగారి శిష్యులు!

మమ్మల్ని రెస్ట్ తీసుకోమని చెప్పి బాబాయిగారు వాళ్ళతో కూర్చుని పాఠం మొదలుపెట్టారు. భారత రాజ్యాంగం!

జోక్‌లతో నవ్విస్తూ వర్తమాన రాజకీయాలకు అన్వయిస్తూ ఆయన పాఠం చెబుతోంటే - జర్నలిస్ట్‌ని నాకే ఎంతో ముచ్చటేసింది.

ఈలోగా పిన్నిగారు ఒక టేబుల్‌ని ప్రక్కకి లాగి కుర్చీలు వేసి అరటాకుల్లో వేడివేడి మజ్జిగన్నం ఆవకాయ వడ్డించారు.

వద్దు వద్దు అంటూనే లాగించేశాం.

## తల్లి గోదారి

తల్లీ, గోదారి నీకు దండాలమ్మా
మా బ్రతుకు నిండుగా పండాలమ్మా
వలవేయరా... ఈలపాట పాడరా
రంభ వచ్చిందోయ్, మేనకొచ్చిందోయ్
కాదు కాదు ఊర్వసొచ్చిందోయ్
ఎందుకొచ్చిందోయ్?
నీ కోసమా? నా కోసమా? కాదు కాదు,
గండుమీను కళ్ల కోసమూ
మా కష్టాన్ని చూసి నీవు దయతలచవా
నీవు తప్ప మాకెవరు దిక్కెవరమ్మా
చల్లగ చూడాలి, మెల్లగ రావాలి
అందరాని చందమామవై పోకమ్మా
నీ మీదే మా బ్రతుకు ఉందోలమ్మా.
కోడి గుడ్డిస్తాను కొట్టో కొట్టో
బాతు గుడ్డిస్తాను బాదో బాదో
తెలుకలో లింటికాడ తేనె పట్టున్నాది
కొట్టో కొట్టో, బాదో బాదో...
అరెరెరే ... చందమామ ... చందమామ
పెద్ద చేపలొచ్చాయి చందమామ
మా బ్రతుకు పండింది చందమామ
గోదారి తల్లి నీకు దండాలమ్మ.

—డా: ఎన్.అప్పన్న

బాబాయిగారు మూర్తీభవించిన సౌజన్యం అయితే, పిన్నిగారు రూపుదాల్చిన ఆత్మీయత. మరి యిలాంటి వారిని అవమానించి యింట్లోంచి తగిలేసిన కొడుకూ, కోడలూ ఎలాంటివారో కదా!

* * *

బస్ కోసం గంటన్నర నుండి ఎదురుచూస్తూ కాంప్లెక్స్‌లో కూర్చున్నాడు తరుణ్... గోల... ఈగలు.. .. దుర్గంధం... భరిస్తూ. కావలసిన బస్సు కాక మిగిలినవన్నీ వస్తున్నాయ్, పోతున్నాయ్.

నిరీక్షణలోనే మెదడు మేల్కొంటుంది. ఆలోచనలు రాజుకుంటాయి.

గడ్డాలొచ్చాక కూడా అమ్మ అద్దాలలోనే ఆమె ప్రేమకు ఏకైక వారసుడుగా పెరిగాడు తరుణ్. కాళీ దొరికినప్పుడల్లా అమ్మ ఒడిలో తల పెట్టుకొని కబుర్లు చెబుతూ పడుకునేవాడు.

ఉద్యోగంలో చేరాక బిజీ... పెళ్ళి అయాక మరీ బిజీ అయిపోయాడు.

అమ్మ ఒడి మెత్తదనం ముఖం మొత్తింది. చెలి కౌగిలి వెచ్చదనమే నచ్చింది. ఒక సంవత్సరంపాటు స్వర్గమే వాళ్ళింట్లో బ్రాంచి ఆఫీసు పెట్టింది!

కొత్తగా పెళ్ళయిన తన మిత్రుల సంసారాలతో పోల్చుకొని తరుణ్ గర్వపడేవాడు.

కొడుకు తన చేయిజారి కోడలి కొంగులో ముడిపడిపోతాడన్న భయంతో ఆ తల్లులు కోడళ్ళని పెట్టే హింస, సంసారాన్ని నరకంగా మార్చేసే జగడాలూ, పితూరీలు... తమ యింటిలో లేవని పొంగిపోయేవాడు. అందుకు తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతతో హృదయం నిండిపోయేది.

కానీ...

రెండో సంవత్సరం తమ యింటిలోనూ నస్సని సెగలు ప్రారంభం అయాయి. తన ఎదుటే భార్య - అమ్మను గేలి చేయడం, ఈసడించడం ప్రారంభం అయాయి. సున్నిత మనస్కుడు తను! అమ్మ బాధపడుతుందని భయం! భార్యను మందలించలేని మెతకదనం మధ్య నలిగిపోయాడు.

భార్య శృతిమించి రాగాన పడింది.

ఇక తండ్రి కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదు! కోడల్ని తిట్టలేదు, కొడుకునీ తిట్టలేదు. "మా వల్ల మీకు యిబ్బంది ఎందుకులే. తీర్థయాత్రలు చేసుకుంటూ కొద్ది కాలం ఎక్కడో ఉంటాంలే" అని గడప దాటారు వృద్ధ దంపతులు.

వద్దని వారించలేని సున్నితుడు తరుణ్! దిగ్భ్రాంతిగా కన్నీళ్ళతో అలాగే నిలబడిపోయాడు! పీడ విరగడైందని భార్య చేసిన పరమాన్నం బాధపడుతూనే తిన్నాడు పాపం!

పీడ విరగడ కాదుగాని, యింటికి శని దాపురించింది అత్తమామల రూపంలో. వాళ్ళు ఏదో మిషమీద యింటికి రావడం, వారాల తరబడి

త్తిష్ట! సినిమాలు, షికార్లూ, హోటలు భోజనాలూ, సంసార విషయాల్లో తల దూర్చి సలహాలివ్వడం, వినకపోతే మందలించడం. భార్య కూడా వాళ్ళతో చేరి తనని వేళాకోళం పట్టించడం. లోకువ చేయడం...

జీవితం దుర్భరం అయింది. భరించలేకపోయాడు.

ఘర్షణ... వాదోపవాదాలు.

పిల్లలు పుట్టడం, బారసాల, పెద్దవాడు కాన్వెంట్‌లో చేరడం – శుభకార్యాలన్నీ తన తల్లిదండ్రులు లేకుండానే జరగడం. అసలు వాళ్ళెక్కడ వున్నారో గత నాలుగు సంవత్సరాలుగా తెలియకపోవడం తరుణ్‌కి బాధగానే వుంది. కుమిలిపోతూనే వున్నాడు.

చివరకు మెతకదనం వదిలిపెట్టి, భార్యకు దృఢంగా చెప్పేశాడు. "నా తల్లిదండ్రులకు స్థానం లేని యింట్లో మీ తల్లిదండ్రులకూ స్థానం వుండదు. ఇకపై వాళ్ళు వచ్చారంటే నేనూరుకోను."

మర్నాడే వాళ్ళని రప్పించింది భార్య! ఆ పూట తరుణ్ భోజనం చేయలేదు. వేళాకోళాలాడుకుంటూ, నవ్వుకుంటూ వాళ్ళంతా అతని ఎదుటే భోజనం చేశారు.

రాత్రి కూడా తరుణ్ ఎంగిలిపడలేదు.

కానీ వాళ్ళంతా భోజనం చేశారు – ఈసారి నిశ్శబ్దంగా!

రాత్రంతా జాగ్రత్తగా ఆలోచించి మర్నాడుదయమే మామగారు అల్లుణ్ణి మందలించారు.

"మీ కోడలు కూడా మిమ్మల్ని యింట్లోంచి తగిలేసినప్పుడు ఇక్కడకొచ్చి నాకు సలహాలివ్వండి. అప్పుడు వింటాను. అంతవరకూ నా గుమ్మం తొక్కవద్దు" నిశ్చలంగా అన్నాడు తరుణ్.

అంతే, అత్తమామల రాకపోకలు బంద్!

అయితే భార్య మాత్రం కందిరీగ అయింది. తరుణ్ చర్మం మొద్దుబారింది! తల్లిదండ్రులెక్కడున్నారో తెలుసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాడు.

* * *

టైమ్ నాలుగు సమీపిస్తుండగా నేనూ, పుల్లారావూ మంత్రిగారింటికి వెళ్ళాం. షరా మామూలే. రేపు రమ్మన్నారు.

బాబాయిగారి హోటల్‌కు వచ్చేశాం. అప్పటికాయన పాఠం ముగించి విశ్రాంతిగా ఈజీ ఛైర్‌లో కూర్చున్నారు. ఆ రోజు హోటల్‌కి సెలవు. అదీ విశ్రాంతికి కారణం.

దగ్గరగా కుర్చీలు లాక్కుని కూర్చుంటూ "మీకొచ్చే పెన్షన్ చాలదా? ఈ వయస్సులో కష్టపడుతూ హోటల్ నిర్వహించడం..." అన్నాను.

"పాటుపడుతూ వుంటే పాడు ఆలోచనలు రావు" అన్నారాయన నవ్వేస్తూ.

ఈలోగా పిన్నిగారు మా అందరికీ టీ యిచ్చి మరో కుర్చీలాక్కుని కూర్చున్నారు.

"మీలాంటి ఉత్తముల్ని తగిలేసిన ఆ కొడుకు..."

నా మాట పూర్తికానే లేదు. ఆయన అందుకున్నారు "వాడి తప్పు ఏదీ లేదు బాబూ! సక్రమంగా పిల్లల్ని పెంచి వాళ్ళకొక దారి చూపించడమే తల్లిదండ్రుల బాధ్యత. అందుకు ప్రతిఫలంగా జీవితాంతం నన్ను పోషించరా అబ్బాయీ అనడం సహజం కావచ్చు. సంప్రదాయం కావచ్చు. కాని న్యాయం కాదు! ఉద్యోగ ధర్మంగా నీ ఫైలు మీద సంతకం పెట్టేశాక అందుకు ప్రతిఫలం ఆశించడం న్యాయమా? తృణమో పణమో ముట్టజెప్పకుండా నీ ఫైలు నువ్వు తీసుకుపోవడం తప్పు అవుతుందా? అలాగే యిదీ!"



## కృష్ణం వందే!

"అన్నయ్యా! స్వర్గం నుండి పారిజాతం తెచ్చాను" శ్రీకృష్ణుడు బలరామునితో అన్నాడు.

"కామధేనువుడు తేవలసింది. వ్యవసాయమునకు మంచి ఎద్దుల్ని ప్రసాదించి వుండును!"

"సేద్యానికి మరనాగల్ని ఏర్పాటుచేస్తున్నానన్నయ్యా!"

"తమ్ముడూ! సముద్ర మధ్యంలో ద్వారకను నిర్మించమన్నావు. మరి మనకి మంచినీరు ఎలా?" బలరాముడి సందేహం.

"గంగ నా పాదం నుండి ఉద్భవించినదేగదా అన్నయ్యా! ఇక నీటికేమి కొరత?!"

– వి.మంజురాణి

పిన్నిగారి వైపు చూశాను. ఆమె కూడా ఆయన వాదాన్ని బలపరుస్తున్నట్టే కనిపించారు, భార్య కదా! అయితే నాకే ఆ వాదన విపరీతంగా అనిపించింది. "మీ బాధ్యత సరే. మరి కొడుకుగా అతని బాధ్యత?" అడిగాను.

ఈసారి పిన్నిగారు అందుకున్నారు "బాధ్యత, బాధ్యత అంటారుగాని నిజానికిప్పుడెక్కడుంది బాధ్యత? బస్సులు తగలబెట్టే స్టూడెంట్స్‌లోనా? పార్టీలు ఫిరాయించే నాయకుల్లోనా? చీటికీ మాటికీ సమ్మెలు చేసేవారిలోనా? అబద్ధాలు ప్రచారం చేసే పత్రికల్లోనా? ఎక్కడుంది బాధ్యత?"

ఆమెను వారిస్తూ బాబాయిగారు అన్నారు "నిజమే. మా అబ్బాయి మా పట్ల సరిగా వ్యవహరించలేదు. అందుకు బాధపడ్డాం. అయితే తనకు నచ్చిన పద్ధతిలో జీవించే హక్కు అతనికి లేదా? రోజూ వాడిని తిట్టుకుంటూ మనసు పాడుచేసుకోవడం ఎందుకు? గతాన్ని తవ్వుకునే వాడికి భవిష్యత్తు వుండదని నమ్మినవాడిని. అందుకే కొత్త జీవితం ప్రారంభించాం. హాయిగానే వున్నాం."

తగిలేసిన తనయుడి మీద ఎంతటి ఔదార్యం!

"కొడుకులారా! మీరంతా తల్లిదండ్రుల్ని యింట్లోంచి తగిలేయండి – అని సందేశం యిస్తున్నట్టుగా వున్నారు!" అవసరం కంటే ఎక్కువ వ్యంగ్యం విసిరింది నా స్వరం.

ఓసారి నా వైపు నిశ్చలంగా చూస్తూ వుండిపోయారాయన. నేను అప్రయత్నంగా కుంచించుకుపోయాను.

"అదికాదు నాయనా నా ఉద్దేశం" అంటూ మృదువుగా వివరించారు.

చాలా మంది ఉద్యోగంలోంచి రిటైర్ అవుతారుగాని జీవితంలోంచి హుందాగా రిటైర్ అవడం తెలీదు. కొడుకు ఇంకా తమ చెప్పుచేతల్లోనే, తమ గుప్పిట్లోనే వుండాలనుకుంటారు. కొడుకు తన అభిప్రాయం చెబితే ఎదిరిస్తున్నాడని బాధపడిపోతారు.

కొడుకు సుఖపడాలని పెళ్ళయితే చేస్తారుగాని వాళ్ళు హాయిగా వుంటే చూడలేరు. కొడుకు, పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ అయాడని భయపడిపోతారు. వాళ్ళ బ్రతుకు వాళ్ళని బ్రతకనివ్వరు.

ఎందుకు? కొడుకు వేరుపడితే తాము వంటరిగా జీవించలేమని భయం! రోగం, రొష్టూ వస్తే చూసేవాళ్ళుండరని భయం!

"కొడుకు నిరాదరణకు గురియైనవారు కృంగిపోనక్కరలేదని నిరూపించడమే నా లక్ష్యం. కన్న కొడుకుని తీర్చిదిద్దడంలో కొంత స్వార్థం వుంటుందేమో కాని నేనిక్కడ సంపాదించుకున్న కొడుకుల్ని తీర్చిదిద్దడంలో స్వార్థం లేదు. నిస్వార్థసేవ ఎంత హాయిగా వుంటుందో, ఎంత ఆత్మతృప్తి యిస్తుందో స్వయంగా అనుభవిస్తున్నాం. చీకూ చింతా లేదు. బాదర బందీల్లేవు, భవిష్యత్తు గురించి భయం లేదు."

ఆయన కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. ముఖం ప్రశాంతత వెదజల్లుతోంది. ఆయనొక కర్మయోగిలాగ కనిపించారు.

"అమ్మా!"

ఉలిక్కిపడి గుమ్మం వైపు చూశాం.

పరుగులాంటి నడకతో ఆ యువకుడు లోనికి దూసుకొచ్చి పిన్నిగారి కాళ్ళ మీద పడ్డాడు. ఆమె అతనిని లేవదీసి హృదయానికి హత్తుకుంది

"బాబూ! బాబూ! బాబూ!!" అని పలవరిస్తూ.

"అమ్మా! అమ్మా! అమ్మా!!" అని విలపిస్తూ అతడూ!

హృదయాలు కరిగిపోయి కన్నీటి ప్రవాహం!

వేమూ, వుల్లారావూ బయటకు నడిచాం. ఎట్టకేలకు ఆ కుటుంబం కలతలు మరిచి కలిసిపోయినందుకు నాకెంతో ఆనందంగా వుంది.

* * *

మర్నాడు–

మంత్రిగారి ఇంటర్వ్యూ కోసం టౌన్ నుండి వస్తూ మొదట బాబాయిగారి హోటల్‌కు వెళ్ళాం. టైమ్ పది దాటింది. హోటల్ పని ముగించి బాబాయిగారు విశ్రాంతిగా కూర్చున్నారు. శిష్యులు ఒకరొకరే వస్తున్నారు.

"ఎప్పుడు ప్రయాణం?" అని అడిగాను.

నవ్వి ఊరుకున్నారాయన.

"వెళ్ళడం లేదా?" ఆత్రంగా అడిగాను.

దానికీ సమాధానం లేదు. వాళ్ళబ్బాయి వెళ్ళిపోయినట్టున్నాడు.

పిన్నిగారు పెసరట్లు తెచ్చి మా ముందుంచారు. లాగించేశాం. రవణ చెప్పింది నిజమే. వుల్లారావు పెసరట్లని ఒకటే పొగిడేస్తున్నాడు.


"ఈ పెసరట్లే మా కొంప ముంచాయి నాయనా!" అన్నారు బాబాయి నవ్వుతూ. "నిన్న సాయంకాలం మీరు వెళ్ళిపోయాక, ఊరిజనం అంతా వచ్చిపడ్డారు. మీరు వెళ్ళిపోతే మాకు పెసరట్లు పెట్టేవారెవరు? వెళ్ళవద్దని ఒకటే గొడవ."

"నా మీద నెపం ఎందుకు? అసలు మీకే వెళ్ళడం యిష్టం లేదు" అన్నారు పిన్నిగారు కాస్త నిష్ఠూరంగా.

"వెళ్ళడం యిష్టం లేదా?!"

శిష్యుల వైపొకసారి చూసి బాబాయిగారు నెమ్మదిగా అన్నారు "నేను వెళ్ళిపోతే వీళ్ళ చదువు మధ్యలో ఆగిపోతుంది. ఒక్క కొడుకు కోసం యింతమంది కొడుకుల భవిష్యత్తు నాశనం చేయడం న్యాయమా? అదీకాక నిన్న అబ్బాయి ఒక్కడే వచ్చాడుగాని కోడలు రాలేదు. ఆమె కింకా మా మీద సద్భావం కలగలేదన్న మాట! ఈ పరిస్థితిలో అక్కడికెళితే వాళ్ళ సంసారంలో మా మూలంగా మరిన్ని కలతలు..."

"వుల్లారావ్! మంత్రిగారి ఇంటర్వ్యూ కాన్సిల్! మనం ఇప్పుడు బాబాయిగార్ని ఇంటర్వ్యూ చేస్తున్నాం! ఫోటో సెషన్‌కి ఏర్పాటుచెయ్" అరిచాను ఆనందోత్సాహాలతో.





## ఊరు ఎక్కడే చిలకా!

భూమ్మీద ఇల్లుండాలి కదా
భూమిలోకే ఇల్లు పోయింది
ఊరు ఊరంతా భూమిలోకి ఊడ్చుకుపోయింది
చీపురు ఊడ్చే ఇల్లే లేదు –
ఊరు ఎక్కడే చిలకా!
వాడల జాడలెక్కడే చిలకా!
రక్షించే ఇంటికప్పను మృత్యువు సమాధి పేర వ్రాసింది
నాల్గు భుజాలు మోయకుండానే ఎక్కడికక్కడ సామూహిక ఖననాలు – ఆరని అగ్ని దూలాలు!
అరచేతి రేఖలు అర్ధాయువును లెక్కవేసిన గ్రావు రేఖలే
బ్రహ్మరాత అందరి నుదుటి మీద ప్రకంపమే
ఇక్కడి జీవితాలను సిస్మోగ్రాఫ్ కొలిచింది!
ఇంటి వాకిలి ఏదే చిలకా!
వాకిట్లోని ముగ్గులేవే చిలకా!
పంట పండించిన వాడి కడుపులోకి పోలేదు
పండించిన వాడు భూమి కడుపులోకే పోయాడు
ఇవి ఆకలి చావులా, ! కావు –
నేల తల్లి ఉన్మాద హత్యలు
కలలు కనే రెప్పలు తెరుచుకోలేదు
భూమి తెరుచుకుని కలలను మూసివేసింది
రెప్ప కింద ఇప్పుడు కలలు సమాధి
రెప్ప పై ఇల్లు సమాధి
ఎవరి ఇల్లు వారికే సమాధి
శ్మశానం ప్రత్యేకంగా లేదు – ఊరి చివర శ్మశానం ఏడుస్తోంది
ఊరు ఎక్కడే చిలకా!
నీ జోస్యమెక్కడే చిలకా!
ధాత్రి కూలిన వేళ
అన్నీ శోక దినాలే –
సుప్రభాతం లేదు
శుభరాత్రి లేదు
బ్రతికున్నవాడు చచ్చిన వాడి గుర్తు
ఊరు లేదే చిలకా!
ఏడ్చే వారు లేరే చిలకా!
దీపాల వరుసలు లేవు
అన్నీ ఇండ్లు కూలిన వరుసలే
అందరికీ భూమి వరుసకు యముడైపోయింది
ప్రమిద ఎక్కడే చిలకా!
వెలిగే వత్తి ఎక్కడే చిలకా!
పుడక పుడక తెచ్చి
ఉన్నవారికి గూడు కట్టే చిలకా! ఊరు కట్టే చిలకా
ఓదార్చి పలుకవే చిలకా!

— కందాళై రాఘవాచార్య

మహారాష్ట్రలోని భూకంప విషాదానికి అక్షరాల కదిలి.... –